# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 3 | పేజీలు: 5 | వెల: రూ.4/- | శుక్రవారం 22 ఆగస్టు 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


### కచ్‌లో 7 నిమిషాల వ్యవధిలో
## రెండుసార్లు భూ ప్రకంపణలు

అహ్మదాబాద్: గుజరాత్‌లోని కచ్ జిల్లాలో 7 నిమిషాల వ్యవధిలో రెండు సార్లు భూకంపం వచ్చింది. గురువారం రాత్రి 10.12 గంటల సమయంలో 3.4 తీవ్రతతో తొలిసారి భూమి కపించింది. మళ్లీ 7 నిమిషాల తర్వాత ప్రకంపణలు రావడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. భచాకు 20 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నదని ఇన్‌స్టిట్యూట్ ఆప్ సీస్మొలాజికల్ రీసెర్చ్ వెల్లడించింది. రాత్రి 10.19 గంటల సమయంలో 2.7 తీవ్రతతో భూమి కంపించిందని తెలిపింది. రాపార్‌కు 19 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నదని పేర్కొంది. వరుస భూకంపాల వల్ల ఎవరికీ ఎలాంటి హాని జరుగలేదని జిల్లా అధికార యంత్రాంగం తెలిపింది.

# కాళేశ్వరంపై వాడీవేడిగా వాదనలు

### విచారించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్
### ఎప్పుడు అసెంబ్లీలో పెడతారు..?
### చర్యలు ఎప్పుడు తీసుకుంటారని ప్రశ్నలు



హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే ఉదయం)

మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు కాళేశ్వరం కమిషన్ నివేదికపై వేసిన పిటిషన్లపై తెలంగాణ హై కోర్టులో గురువారం విచారణ జరిగింది. రెండు పిటిషన్లను కలిపి హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ విచారించింది.ఐదు అంశాలను ప్రేయర్‌గా పేర్కొన్నారు పిటిషనర్లు. కేసీఆర్ తరఫున వాదనలను సుప్రీంకోర్టు న్యాయవాది ఆర్యామ సుందరం వినిపించారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక రద్దు చేయాలని కేసీఆర్, హరీష్‌రావు కోరారు. కమిషన్ నియమిస్తూ గత ఏడాది జీఓను కొట్టేయాలని కేసీఆర్, హరీష్‌రావు కోరారు. తమకు కమిషన్ నివేదికను ఇవ్వలేదని కేసీఆర్, హరీష్‌రావు పేర్కొన్నారు. కమిషన్ విచారణ సమయంలో యాక్ట్ సెక్షన్ 8బీ, 8సీ నోటీసులు ఇవ్వలేదని పిటిషన్‌లో సుందరం తెలిపారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని పిటిషన్‌లో వెల్లడించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా బీఆర్ఎస్‌ని ప్రతిష్టపాలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పిటిషనర్ తరుపు న్యాయ వాది తెలిపారు. రాజకీయ వ్యూహంతోనే జస్టిస్ గోష్ కమిషన్ కమిషన్ నియామకం జరిగిందని వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా కమిషన్ నివేదిక రూపొందించిందని వివరించారు. దురదృష్టవశాత్తు వివిధ కారణాలతో మేడిగడ్డ బ్యారేజ్ ఒక పిల్లర్ కుంగిందని.. వర్షాకాలంలో అకాల వర్షాలు కారణంగా కూలిందని తెలిపారు. కుంగిపోవడానికి డిజైనింగ్ కానీ ఇంజనీరింగ్‌తో ఎలాంటి సంబంధం లేదని పిటిషనర్ల తరుపు న్యాయ వాది స్పష్టం చేశారు. నివేదిక కాపీలను తమకు అందజేయకుండా మీడియాకు అందజేయడంలో దురుద్దేశం ఉందని చెప్పుకొచ్చారు. సాధారణ ప్రజల్లో తమ పరువును

..మిగతా 2లో

### నిర్మలా సీతారామన్‌తో
# భట్టి విక్రమార్క భేటీ



న్యూఢిల్లీ, ఆగస్టు 21 (నమస్తే ఉదయం)

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ను తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. గురువారం ఢిల్లీలో పార్లమెంట్ లో నిర్మలా సీతారామన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక సంబంధిత అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో భట్టితో పాటు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, రామసహాయం రఘురాం రెడ్డి ఉన్నారు. అంతకు ముందు జీఎస్టీ రేట్ రేషనలైజేషన్ సమావేశానికి హాజరైన భట్టి విక్రమార్క రాష్ట్రాల ఆదాయాలు క్షీణించకుండా చర్యలు తీసుకోవాలని వాటాకు తగిన విధంగా దక్షిణాది రాష్ట్రాలకు నిధుల పంపిణీ జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జీఎస్టీ ప్రవేశపెట్టిన సమయంలో రాష్ట్రాల వార్షిక వృద్ధి రేటు 14 శాతంగా ఉండటంతో, వార్షికంగా 14 శాతం వృద్ధి కలుగుతుందని హామీ ఇచ్చారని కానీ ఇప్పటి వరకు 14 శాతం వృద్ధి స్థిరపడలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రాల వార్షిక వృద్ధి కేవలం 8 నుంచి 9 శాతం మధ్యలోనే ఉందని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలలో భాగంగా రేట్ రేషనలైజేషన్ ప్రతిపాదనకు మద్దతు తెలిపినా, దానికి సరైన పరిహార యంత్రాంగం ఉండాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# ప్రజాపాలన అంటే ఇదేనా?

### చెప్పుల వరుస వద్ద రైతు పడుకున్న ఫొటోను ట్వీట్ చేసిన బీఆర్ఎస్, కేటీఆర్
### తెలంగాణ వ్యాప్తంగా తీవ్రమైన ఎరువుల కొరత
### గ్రామాల్లోని ఎరువుల కేంద్రాల వద్ద రైతుల బారులు
### ప్రభుత్వ పాలనపై వెల్లువెత్తుతున్న విమర్శలు
### రైతులను రోడ్లపైకి తీసుకురావడమేనా ప్రజా పాలన అని బీఆర్ఎస్ ప్రశ్న



హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే ఉదయం)

తెలంగాణ రాష్ట్రంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. రాష్ట్రంలోని అనేక గ్రామాలు, పట్టణాల్లో ఎరువుల పంపిణీ కేంద్రాల వద్ద రైతులు గంటల తరబడి నిరీక్షిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. వ్యవసాయ పనుల సీజన్‌లో ఎరువులు లభించక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇది ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని విపక్ష నేతలు విమర్శలు చేస్తున్నారు."ప్రజా పాలన అంటే ప్రజలను

..మిగతా 2లో



# మియాపూర్‌లో విషాదం

### ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అనుమానాస్పద మృతి!

న్యూఢిల్లీ, ఆగస్టు 21 (నమస్తే ఉదయం)

హైదరాబాద్‌లోని మియాపూర్‌లో విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఐదు గురు మృతి చెందారు. వీరంతా ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొంటున్నారు. ఈ ఘటన మియాపూర్‌లోని మక్తా మహబూబ్‌పేటలో జరిగింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుల

..మిగతా 2లో

### ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా
# జస్టిస్ సుదర్శన్ రెడ్డి నామినేషన్
### హాజరైన సోనియా, రాహుల్



న్యూఢిల్లీ, ఆగస్టు 21 (నమస్తే ఉదయం)

దేశంలో ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. ప్రతిపక్ష కూటమి ఇండియా అలయన్స్ తరపున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రిటైర్డ్ న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. పార్లమెంటరీ కార్యదర్శికి ఆయన తన నామినేషన్‌ను సమర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, శరద్ పవార్, ప్రియాంక గాంధీ, తిరుచ్చి శివ తదితరులు ఉన్నారు. నామినేషన్ వేయడానికి ముందు జస్టిస్ సుదర్శన్ రెడ్డి.. పార్లమెంట్ ప్రాంగణంలోని స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు నివాళులు అర్పించారు. ఇప్పటికే ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాని మోదీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు ఈ కార్యక్రమంలో

..మిగతా 2లో

# జూరాలకు పెరుగుతున్న వరద ప్రవాహం



*గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు21(నమస్తే ఉదయం) ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు వరద తీవ్రత క్రమంగా పెరుగుతున్నది. జూరాల పూర్తి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా ప్రస్తుతం 316.460 మీటర్లుగా ఉంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిలువ 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.882 టీఎంసీలుగా ఉంది. జూరాల జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద నీరు రావడంతో జూరాల అధికారులు విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారు. గురువారం సాయంత్రానికి ఎగువ జలాశయాల నుంచి జూరాలకు 3,65,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. కృష్ణానదీ వరద తీవ్రతను దృష్టిలో పెట్టుకుని జూరాల అధికారులు ప్రాజెక్టు 41 గేట్లను ఎత్తివేసి 3,80,635 పైగా క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అలాగే జూరాల పై ఆదారపడిన కుడి కాలవకు 320, ఎడమకాలువకు 550 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కృష్ణా నదీ ప్రవాహ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.*

# జలమండలిలో రెవిన్యూ పెంపునకు సంస్కరణలు

ఖైరతాబాద్, ఆగస్టు 21(నమస్తే ఉదయం): జలమండలి రెవిన్యూ పెంచడమే లక్ష్యంగా నూతన సంస్కరణలు ప్రవేశపెట్టనున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ తో కలిసి గురువారం రోజున జూబ్లీహిల్స్ లోని జలమండలి థీమ్ పార్క్ లో రెవిన్యూ, ఐటీ విభాగ అధికారులతో మేథోమథన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ... ఇప్పటికే జలమండలి అందిస్తున్న నాణ్యత సేవలకు గాను ఇప్పటికే మంచి గుర్తింపు లభించిందని తెలిపారు. అలాగే జలమండలి ఆదాయం పెంచేందుకు రెవిన్యూ, ఐటీ విభాగాల్లో నూతన సంస్కరణలను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రస్తుతం డొమెస్టిక్ కేటగిరీ కింద ఉన్న వాణిజ్య కనెక్షన్లను గుర్తించడం అవసరమని ఆయన అన్నారు. ఇందుకోసం జిహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలోని నాన్-రెసిడెన్షియల్ భవనాల జాబితా సేకరించి వాటిని వాటర్ సప్లై కనెక్షన్లతో పోల్చాలని సూచించారు. బోర్డుకు వచ్చే ఆదాయం కొత్త ప్రాజెక్టులకు సరిపోకపోయినా, నీటి సరఫరా మరియు సీవరేజ్ సేవల మెరుగుదలకు మాత్రం ఉపయోగపడుతుందని వివరించారు. అలాగే, ఎంతో ప్రయాసతో సుదూర ప్రాంతాల నుంచి తరలిస్తున్న విలువైన నీటిని తక్కువ ధరకు తాగునీరు సరఫరా చేస్తున్నదని ఆయన గుర్తుచేశారు. జలమండలి ఆదాయం పెరగడానికి.. మరింత మెరుగైన సేవల కొరకు రెవిన్యూ, ఐటీలో ప్రతిపాదించిన సంస్కరణలను జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ మేథోమథన సదస్సులో వివరించారు.

### ప్రతిపాదించిన కొన్ని ముఖ్యమైన సంస్కరణలు:

అన్ని ఓ అండ్ ఎం, సెక్షన్‌ల వారీగా సరఫరా చేసే నీటి పరిమాణం, పైపు పరిమాణం, మీటర్ ను బట్టి వివరాల నివేదికలను రూపొందించి తుది నిర్ణయం తీసుకోవడం.

మీటర్ లేని కనెక్షన్లకు బిల్లింగ్ విధానం.. ప్రస్తుత డాకెట్ సగటు కంటే మెరుగైన ప్రత్యామ్నాయాలను అధ్యయనం చేయడం.

ఎప్పటికప్పుడు రెవిన్యూ వివాదాల పరిష్కారం

బల్క్ కనెక్షన్లు, అంగీకరించిన నీటి సరఫరా పై ఖచ్చితమైన విధానం.

అవసరమైన ప్రాంతాల్లో కనీస బిల్లింగ్‌లో మార్పులు చేయడం.

మీటర్ రీడింగ్ ఏజెన్సీస్ నియామకం కోసం టెండర్ పిలవడం.

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిల వసూలు - వ్యూహ రచన.





### ఆన్లైన్ లో వాటర్ ఫీజబిలిటీ ధ్రువపత్రం..

జిహెచ్ ఎంసీ పరిధిలోని నూతన భవన నిర్మాణదారులకు జలమండలి ఆన్లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. కొత్తగా భవనాలు నిర్మించుకునే వారు జీహెచ్ఎంసీ అనుమతుల కోసం సమర్పించాల్సిన వాటర్ ఫీజబిలిటీ ధ్రువపత్రాన్ని జారీ చేసే ప్రక్రియను జలమండలి సులభతరం చేసి ఆన్లైన్ లోనే పొందేలాగా సరికొత్త సదుపాయాన్ని కల్పించింది.

జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ కలిసి జూబ్లీహిల్స్ లోని జలమండలి థీమ్ పార్క్ లో ఈ ఆన్‌లైన్‌లో వాటర్ ఫీజబిలిటీ ధ్రువపత్రాన్ని జారీ చేసే సేవలను లాంఛనంగా ప్రారంభించారు.

గ్రేటర్ పరిధిలోని నూతన భవనం నిర్మించాలంటే జీహెచ్ఎంసీ పర్మిషన్ తప్పనిసరి. ఆ పర్మిషన్ కోసం భవన యజమానులు విద్యుత్ ఫీజబిలిటీ తో పాటు జలమండలి జారీ చేసే వాటర్ ఫీజబిలిటీ ధ్రువపత్రం సమర్పించాలి. గతంలో ఈ సర్టిఫికెట్స్ పొందాలంటే జలమండలి సర్కిల్ కార్యాలయాల్లో, తర్వాత ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలో సీజీఎం జారీ చేసేవారు. వివిధ కారణాల రీత్యా ఈ ప్రక్రియలో జాప్యం జరిగేది. దీన్ని నివారించి, ఆ ప్రక్రియను సులభతరం చేయడానికి ధ్రువపత్రాల జారీని ఆన్‌లైన్ లోనే పొందేలాగా మార్పులు చేశారు.

### వాటర్ ఫీజబిలిటి ధ్రువపత్రాలు జారీ చేయడానికి వినియోగదారులు చేయవల్సిన పనులు:

1. దరఖాస్తు: కొత్త భవనం నిర్మించదలచిన పౌరులు భవన అనుమతి పథకానికి దరఖాస్తు చేసే సందర్భంలో హెచ్.ఎం.డబ్ల్యూ.ఎస్.ఎస్.బి వెబ్సైట్ ద్వారా నీటి ఫిజిబిలిటీ సర్టిఫికేట్కి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. ఈ కోసం Apply Online for Water Feasibility Certificate అనే లింక్ అందుబాటులో ఉంటుంది. దరఖాస్తు సమర్పించిన వెంటనే ఫైల్ నంబర్ రూపొందించబడుతుంది.

2. పత్రాలు: అవసరమైన పత్రాలను దరఖాస్తు సమయంలోనే అప్‌లోడ్ చేయాలి. అసలు ఇండెమ్నిటీ బాండ్‌ను రికార్డ్ కీపింగ్ కోసం శాఖకు సమర్పించాలి.

3. ప్రాసెసింగ్ ఫీజు: ఒక్కో దరఖాస్తుపై రూ. 5,000/- ప్రాసెసింగ్ ఫీజును నగదు కౌంటర్ / ఆన్‌లైన్ విధానం ద్వారా చెల్లించాలి.

4. ఫీల్డ్ స్టడీ: ఫైల్ సంబంధిత సీజీఎంకి పంపబడుతుంది. ఆయా వివరాలు మొబైల్ యాప్‌లో మరియు చెక్లిస్ట్‌తో పాటు సిస్టమ్ స్క్రీన్‌లో అప్‌డేట్ చేస్తారు.

5. అవుట్‌వార్డ్: ఫిజిబిలిటీ పూర్తి అయిన తరువాత సీజీఎం, అవసరమైతే సిఫార్సులతో కూడిన ఫైల్‌ను అవుట్‌వార్డ్ చేస్తారు.

6. కమిటీ పరిశీలన: ఈడీ/ రెవిన్యూ డైరెక్టర్ మరియు సీజీఎం (రెవిన్యూ)లతో కూడిన కమిటీ వారానికొకసారి ఫైళ్లను సమీక్షించి ఆమోదిస్తుంది.

7. ఆమోద ఉత్తర్వులు: కమిటీ ఆమోదం తరువాత ఫిజిబిలిటీ సర్టిఫికేట్ చార్జీల అంచనాను సీజీఎం (రెవిన్యూ ) తయారు చేస్తారు.

8. చార్జీల చెల్లింపు: పౌరునికి ూమీూ ద్వారా చార్జీల వివరాలు పంపబడతాయి. పౌరుడు 30 రోజుల్లోగా ఆన్‌లైన్ / నగదు కౌంటర్ ద్వారా చెల్లించాలి.

9. సర్టిఫికేట్ జారీ: కనెక్షన్ చార్జీలు అందిన ఫైళ్లకు ూమీూ నోటిఫికేషన్ ఆధారంగా సీజీఎం (రెవిన్యూ) డిజిటల్ సంతకంతో ఫిజిబిలిటీ సర్టిఫికేట్ జారీ చేస్తారు.

ఈ కార్యక్రమంలో రెవిన్యూ సీజీఎం కిరణ్ కుమార్, సింగల్ విండో జీఎం దామోదర్ రెడ్డి, ఐటీ జీఎం సాయి కృష్ణ, రెవిన్యూ జీఎం శ్రీనివాస్, డీజీఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు.



పోతన స్మృతి వనాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

# పాలకుర్తి మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన

**స్మృతి వనం, ఫర్టిలైజర్ షాప్‌ల తనిఖీలు**

**ఆహ్లాదకరంగా స్మృతి వనం**

**మౌలిక వసతుల కల్పనకి వెంటనే చర్యలు**

**సజావుగా యూరియా అమ్మకాలు**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జనగామ, ఆగష్టు 21 (నమస్తే ఉదయం): పోతన స్మృతి వనంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం కలెక్టర్ పాలకుర్తి మండలం లో పర్యటించి పలు సందర్శనలు చేశారు. ముందుగా శ్రీ సోమేశ్వర ఆలయానికి సమీపంలో ఉన్న స్మృతి వనమును కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..స్మృతి వనం పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండాలని... ఆలయం కి వచ్చే భక్తులు సందర్శించి కాసేపు గడిపే విధంగా తీర్చి దిద్దాలన్నారు. విద్యుత్, సీసీ కెమెరా లు,పిల్లల ఆట వస్తువులు, వనిత టీ స్టాల్ ఏర్పాటు,వాచ్ మెన్, తాగు నీటి వసతి తదితర మౌలిక వసతుల ఏర్పాటు కు సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మండల సమాఖ్య సమావేశాల నిర్వహణ కోసం కేటాయించిన ఫంక్షన్ హాల్ ను సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి ని కలెక్టర్ పరిశీలించి. మండలం లోని ప్రజల అవసరాల నిమిత్తం..వారు ఏదైనా ఫంక్షన్ లను నిర్వహించు కునేలా. ఎలాంటి ఇబ్బంది లేకుండా వసతులు ఉండాలన్నారు. అనంతరం మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి. ఇప్పటివరకు యూరియా తీసుకున్న రైతుల వివరాలను రిజిస్టర్లో నమోదు చేశారా లేదా అని చూశారు. ఎన్ని ఎకరాలు ఉన్న రైతు.. ఎన్ని బస్తాల యూరియా తీసుకున్నారు, వారి వివరాలను నమోదు చేసారా లేదా అని రిజిస్టర్ లను చెక్ చేసారు. అలాగే గోదాం లో ఉన్న స్టాక్ ని కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సరిపడా యూరియా ఉన్నప్పటికీ... కొరత సృష్టించాలని ప్రయత్నిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులను ఎక్కువ సేపు వెయిటింగ్ చేపించకుండా యూరియా అమ్మకాలు త్వరగా కావాలన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి ఇతర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా

# జస్టిస్ సుదర్శన్ రెడ్డి నామినేషన్

మొదటి పేజీ తరువాయి...

పాల్గొన్నారు. ఈ ఎన్నిక ఏకగ్రీవం కావడం కోసం తొలుత ఎన్డీఏ ప్రయత్నించింది. కానీ ఇండియా కూటమి అనూహ్యంగా సుదర్శన్ రెడ్డిని రంగంలోకి దించింది. దీంతో ఈ ఎన్నిక అనివార్యమైంది.

తెలంగాణకు చెందిన సుదర్శన్ రెడ్డి ఎంపికలో సీఎం రేవంత్ కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఎంపికతో సీఎం రేవంత్ రాహుల్ గాంధీతో గ్యాప్ ఉందని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పి కొట్టారని విశ్లేషకులు అంటున్నారు. గతంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రానికి చెందిన పీవీ నరసింహా రావుకు ప్రధాని అవకాశం రావడంతో రాజకీయంగా టీడీపీకి కాంగ్రెస్ బద్ధ శత్రువు అయినప్పటికీ ఎన్టీఆర్ పీవీకి సంపూర్ణ మద్దతు ప్రకటించి తన గొప్పతనాన్ని చాటుకున్నారు. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుపుకు సీఎం చంద్రబాబు, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్‌తో పాటు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

### ఓటింగ్ - ఫలితాలు

ఉపరాష్ట్రపతిగా ఉన్న జగదీప్ ధన్‌ఖర్ ఆరోగ్య కారణాలతో జూలైలో రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలోనే అధికార ఎన్డీఏ, ఇండియా కూటమి తమ అభ్యర్థులను ప్రకటించాయి. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. రేపటితో నామినేషన్ల దాఖలు గడువు ముగియనుంది. ఆగస్టు 25 వరకు నామినేషన్లను ఉపసంహరించుకునే అవకాశం ఉంది. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు మాత్రమే పాల్గొంటారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారా జరుగుతాయి. సెప్టెంబర్ 9న ఎన్నికలు పూర్తయిన వెంటనే అదే రోజు ఫలితాలు వెలువడతాయి. ప్రస్తుత పార్లమెంట్‌లో అధికార బీజేపీకి మెజారిటీ ఉండడంతో ఎన్డీఏ అభ్యర్థి సి.పి. రాధాకృష్ణన్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# కాళేశ్వరంపై వాడీవేడిగా వాదనలు

మొదటి పేజీ తరువాయి...



అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారని తెలిపారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిబంధనలు పాటించలేదని న్యాయవాది సుందరం తెలిపారు. నోటీసులో సరైన విధానంలో ఇవ్వలేదని వాదించారు. నివేదికను కూడా కేసీఆర్, హరీశ్ రావుకు అందించలేదన్న న్యాయవాది సుందరం వెల్లడించారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిందని సుందరం తెలిపారు. రాజకీయంగా నష్టం చేకూర్చేలా నివేదిక రూపొందించారని అన్నారు. ఈ నివేదికపై అసెంబ్లీలో చర్చించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. పిటిషనర్లు కేసీఆర్, హరీష్‌రావు అసెంబ్లీలో సభ్యులుగా ఉన్నారని ఏజీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. అలాంటప్పుడు నివేదికను ఎందుకు బయట పెట్టారని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. మీడియా సమావేశంలో ప్రతి జర్నలిస్టుకు 60 పేజీల నివేదిక అందజేశారని సుందరం తెలిపారు. కోర్టుకి సమర్పించిన కాపీలు సరిగ్గా కనిపించడం లేదని హైకోర్టు అభిప్రాయ పడింది. నివేదిక కాపీలు సరిగ్గా కనిపించేలా ఇస్తే తర్వాత విచారణ చేస్తామని తెలిపింది. కేసు ప్రాధాన్యత దృష్ట్యా ఈరోజే విచారణ కొనసాగించాలని కేసీఆర్ తరుపు న్యాయవాది సుందరం కోరారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక అధికారికంగా విడుదల చేశారా అని ఏజీని హైకోర్టు మూడు ప్రశ్నలు వేసింది. నివేదిక కాపీను పబ్లిక్ డొమైన్ లో పెట్టారా..? పిటిషనర్లకు 8కింద నోటీసులు ఇచ్చారా లేదా..? కమిషన్ నివేదిక ప్రస్తుత పరిస్థితి ఏంటి..? అని హై కోర్టు ప్రశ్నించింది. తాము ఇచ్చిన నోటీస్ 8బీ నోటీస్ అని న్యాయస్థానానికి ఏజీ తెలిపారు. సెక్షన్ మెన్షన్ చేయనంత మాత్రానా అది 8 బి నోటీస్ కాదని కాదంటే ఎలా అని ప్రశ్నించారు. ఈ నివేదికపై అసెంబ్లీలో చర్చించాల్సిందేనని పట్టుబట్టారు. కిరణ్‌భేడీ కేస్‌కి ఈ కేస్‌కు తేడాలు ఉన్నాయని ఏజీ తెలిపారు. రిపోర్టును తాము ఎక్కడ పబ్లిక్ డొమైన్లో పెట్టలేదని ఏజీ క్లారిటీ ఇచ్చారు. అసెంబ్లీలో చర్చించాకే పబ్లిక్ డొమైన్‌లో పెడతామని స్పష్టం చేశారు. కౌంటర్‌లో మరిన్ని వివరాలు పొందపరుస్తామని వివరించారు. ఈ స్టేజిలో ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయొద్దని హైకోర్టును ఏజీ కోరారు. అసెంబ్లీలో ఈ నివేదికపై చర్చించాక తదుపరి విచారణ చేపట్టాలని ఏజీ కోరారు. సెక్షన్ 8బీ కింద కాకుండా ఏ సెక్షన్ కింద నోటీసులిచ్చారా అని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. కమిషన్ నివేదిక ప్రస్తుతం ఏ దశలో ఉందని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. ప్రజాధనాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కమిషన్‌ను ప్రభుత్వం వేసిందని ఏజీ తెలిపారు. కమిషన్ నివేదికను కేబినేట్ సులభంగా అర్థం చేసుకునేలా 60పేజీల నివేదిక రూపొందించారని ఏజీ తెలిపారు. 60పేజీల నివేదిక ఆధారంగా ఘోష్ కమిషన్ నివేదికను కేబినేట్ ఆమోదించిందని ఏజీ వెల్లడించారు. అసెంబ్లీలో చర్చించి తదుపరి చర్యలు తీసుకునేలా కేబినేట్ నిర్ణయం తీసుకుందని ఏజీ వివరించారు. అసెంబ్లీలో చర్చించే వరకు ఈ పిటీషన్‌పై విచారణ చేపట్టవద్దని ఏజీ సూచించారు. ఈ పిటీషన్లపై కౌంటర్ దాఖలు చేయడానికి సమయం కావాలని ఏజీ కోరారు. సెక్షన్ 8బీ కింద నోటీసులివ్వలేదని పిటీషనర్లు తప్పుపట్టడం చెల్లదని ఏజీ పేర్కొన్నారు. అయితే ఈ విచారణ రేపటికి హై హైకోర్టు వాయిదా వేసింది. ఏజీకి మరోసారి హైకోర్టు ప్రశ్నించింది. కమిషన్ నివేదికను ఎప్పుడు అసెంబ్లీలో పెడతారు??? అని అడిగింది. ఈ నివేదికపై చర్యలు తీసుకున్నాక అసెంబ్లీలో పెడతారా??? అని ప్రశ్నించింది. అసెంబ్లీలో పెట్టాక నివేదికపై చర్యలు తీసుకుంటారా?? అని నిలదీసింది. రేపు లేదా సోమవారం సమాచారం తెలుసుకుంటానని ఏజీ తెలిపారు.



# ప్రజాపాలన అంటే ఇదేనా?

మొదటి పేజీ తరువాయి...

ఇలా రోడ్ల మీదకు తీసుకురావడమేనా?" అంటూ బీఆర్ఎస్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేసింది. కేటీఆర్ కూడా సామాజిక మాధ్యమం వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. "రేవంత్ రెడ్డీ, నీ దరిద్రపుగొట్టు పాలనకు దక్కిన అసమర్థ ఆస్కార్ అవార్డు ఇది" అంటూ వనపర్తి జిల్లా ఆత్మకూరు పీఏసీఎస్ ఎదుట చెప్పుల వరుస వద్ద ఒక రైతు పడుకున్న ఫొటోను పంచుకున్నారు. ఈ ఫొటోను ఫ్రేమ్ కట్టించుకుంటావో.. మెడలో వేసుకొని ఊరేగుతావో నీ ఇష్టమని వ్యంగ్యంగా అన్నారు. చేతకాని పాలకులను చూశాం కానీ చెప్పులపాలు చేసిన చెత్త రికార్డు మాత్రం రేవంత్ రెడ్డిదేనని పేర్కొన్నారు. బస్తా యూరియా కోసం రైతు బతుకును బజారున పడేశావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "అన్నం పెట్టే రైతన్నను పాదరక్షల పాలుచేసిన నీ పాపం ఊరికేపోదు. జై కిసాన్.. జై తెలంగాణ" అంటూ ఆయన పేర్కొన్నారు.

# మియాపూర్‌లో విషాదం

మొదటి పేజీ తరువాయి...

వివరాలు సేకరించారు. మృతులు నర్సింహ (60) , వెంకటమ్మ (55) , అనిల్ (32) , కవిత (24) , అప్పు (2) గా పోలీసులు నిర్ధారించారు. కర్ణాటక గుల్బర్గాకు చెందిన నర్సింహ కుటుంబం గత కొంత కాలం నుంచి హైదరాబాద్ లో నివసిస్తోంది.. నర్సింహకు ముగ్గురు కూతుర్లు.. కాగా.. నర్సింహా, అతని భార్య వెంకటమ్మ, రెండవ కూతురు, అల్లుడు, పాపతో మక్తా మహబూబ్‌పేటలో నివిసిస్తున్నాడు.. నర్సింహతోపాటు కుటుంబం మొత్తం కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలోనే వీరంతా బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ ఘటనలో రెండవ కూతురు, అల్లుడు పాపతో సహా నర్సింహా.. అతని భార్య వెంకటమ్మ మృతి చెందారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరి ఆత్మహత్యకు ఆర్థిక సమస్యలు కారణమా..? లేదా మరేదైనా కారణాలు ఉన్నాయా..? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. అయితే.. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మరణించడం స్థానికంగా కలకలం రేపింది.. ఈ ఘటనకు సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది.

# మియాపూర్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అనుమానాస్పద మృతి

**ఆహారంలో విషం కలిపి చంపి ఉంటారని అనుమానిస్తున్న పోలీసులు**

**ఒకే కుటుంబంలో ఐదుగురు చనిపోవడంతో తీవ్ర సంచలనంగా మారిన సంఘటన**

**తెలిసినవారే హత్యకు కుట్ర పని ఉంటారని అనుమానించిన పోలీసులు**

**పెద్ద కుమార్తెను అదుపులో తీసుకుని విచారిస్తున్న మియాపూర్ పోలీసులు**

శేరిలింగంపల్లి, ఆగస్టు 21. (నమస్తే ఉదయం) గత ఆరు సంవత్సరాల క్రితం కర్ణాటక నుండి జీవనోపాధి కోసం వచ్చిన ఒకే కుటుంబంలో ఐదుగురు చనిపోవడంతో స్థానికంగా తీవ్ర విషాదం నేలకొంది. ఈ సంఘటన మియాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మియాపూర్ మక్తా గ్రామంలోని వాసముంటున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. తెలిసిన వారె ఆహారంలో విషం కలిపి పక్క పధకం ప్రకారం హత్య చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఉదయం పక్కింటి వారు తలుపులు ఎంత తట్టిన ఎవరు పలకకపోవడంతో అనుమానం వచ్చిన సమీపలో నివాసముంటున్న బంధువులకు సమాచారం అందిచారు. బంధువులు వచ్చి తలుపులు పగలగొట్టి చూడగా ఐదుగురు మృతి చెంది విగత జీవులుగా పడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పరిశీలించారు.మృతులంతా కర్ణాటక రాష్ట్రం సేడం జిల్లా రంజోల్ ప్రాంతానికి చెందిన వారుగా పోలీసులు చెప్పారు. లక్ష్మప్ప(60) భార్య వెంకటమ్మ(55) కొడుకు భగవంత్ (23) కలబుర్గి జిల్లా ప్రాంతానికి చెందిన అనిల్ (40)కు




మృతుల (ఫైల్ ఫొటోస్)

కుమార్తె కవిత (38) నిచ్చి వివాహం చేశారు.బ్రతుకుదెరువు కోసం నగరానికి వలసవచ్చి గత 6 సంవత్సరాలుగా కుటుంబం సమేతంగా మియాపూర్ నివాసముటున్నారు. మియాపూర్ వికాస్ స్కూల్ దగ్గర ఉండే కిష్టప్ప పెద్ద కుమార్తె లక్ష్మి రాత్రి పిండి వంటలు చేసుకొని వచ్చి 11గంటకు ఇంటికి వెళ్లినట్లు ప్రత్యేక సాక్షులు చెప్తున్నారు. లక్ష్మప్పకు ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు. పెద్ద కుమార్త లక్ష్మి, మూడో కుమార్తె నవతలు ప్రేమ వివాహం చేసుకోగా రెండో కుమార్తె కవిత మాత్రం తల్లిదండ్రులు చూపించిన వాళ్ల బంధువుల అబ్బాయిని వివాహం చేసుకుని వారితోనే ఉంటుంది. దాంతో తల్లిదండ్రులు రెండో కుమార్తె అయిన కవిత బాగా చూసుకునే వారు. దాంతో సొంత ఊరులో ఉన్న రెండు ఎకరాల భూమి కవితకే ఇస్తారని అనుమానంతో కుటుంబ సభ్యులు ఎవరైన ఈ ఘాతకానికి తెగబడ్డారా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కిష్టప్ప కుమారుడు భగవత్ గత మూడు రోజులుగా ఇంటికి కూడా రాలేదని పోలీసులు చెప్పారు. కుమారుడికి ఈ హత్యతో సంబంధం ఉండకపోవచ్చుని పోలీసులు భావిస్తున్నారు. పెద్ద కుమార్తె లక్ష్మి ని అదుపులకు తీసుకుని విచారిస్తున్న మియాపూర్ పోలీసులు. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తము ఆసుపత్రికి తరలించారు



## గ్రంథాలయానికి అవసరమైన పార్య పుస్తకాలను, మరుగుదొడ్లు సమకూర్చాలి

**జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్**

గద్వాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 21(నమస్తే ఉదయం)గురువారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో లైబ్రరీ రూములు, విద్యార్థుల అవసరమైన సౌకర్యాలు, గ్రంథాలయ పుస్తకాలను సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారు చదువుతున్న విధానం, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మరుగుదొడ్ల ప్రధాన సమస్యగా పేర్కొన్న వెంటనే కలెక్టర్ వెంటనే స్పందించి ఇంజనీరింగ్ అధికారులకు మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. లైబ్రరీలో ఎదుర్కొంటున్న మిగతా సమస్యల పూర్తి జాబితాను సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఆ జాబితా ఆధారంగా సమస్యలన్నీ పరిష్కరించడం జరుగుతుందన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. గ్రంథాలయంలో పుస్తకాలను సక్రమంగా పేర్చాలని, విద్యార్థులు సులభంగా ఉపయోగించగలిగే విధంగా ఉండాలని లైబ్రేరియన్ కు సూచించారు. లైబ్రరీలో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లను విద్యార్థులు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త లైబ్రరీ భవనం త్వరలో నిర్మాణం ప్రారంభమై, మరింత ఆధునిక, సౌకర్యవంతమైన లైబ్రరీ విద్యార్థులకు అందుబాటులో ఉండబోతుందని ఆయన తెలిపారు.కొత్త లైబ్రరీ భవన నిర్మాణాన్ని పరిశీలించి వివరాలను మున్సిపల్ కమిషనర్ తో అడిగి తెలుసుకున్నారు.

విద్యాభివృద్ధి కోసం లైబ్రరీని, పుస్తకాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి మీ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు.అనంతరం కలెక్టర్ జమ్మిచేడులోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. నిర్మాణాలు చేపట్టిన బిల్లుల చెల్లింపులు సక్రమంగా అందుతున్నాయా అని లబ్ధిదారున్ని అడిగి తెలుసుకున్నారు. మొదటి విడతగా మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని లబ్ధిదారునికి సూచించారు. లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అంతే విధంగా మున్సిపల్ కమిషనర్లకు లాగిన్ ఐడీ ఇవ్వాలని ఏ.డి మైన్స్ కి ఆదేశించారు. లబ్ధిదారులకు ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ దశరథ్, లైబ్రేరియన్ రామాంజనేయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయం, ఇందిరమ్మ ఇండ్లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్




## చెత్త తీయట్లేదు..!

**కొన్ని వార్డులకే పరిమితమైన మున్సిపల్ సేవలు**


**అస్తవ్యస్తంగా మురుగు కాలువలు**

**ప్రజలకు తప్పని ఇబ్బందులు**

గద్వాల ప్రతినిధి, ఆగస్టు 21(నమస్తే ఉదయం) గద్వాల పురపాలక సంఘం పరిధిలో పలు వార్డులలో చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి. చెత్త తరలింపులో తీవ్ర జాప్యం నెలకొంది. చెత్త కుప్పలపై పశువులు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. గద్వాల మున్సిపాలిటి 12వ వార్డు వేదానగర్ లో గత వారం రోజుల నుంచి రోడ్లపై పేరుకపోయిన చెత్తను తరలించడం లేదని స్థానికులు ఆరోపించారు. కార్మికులు, అధికారులకు ఫోన్ చేయాల్సి వస్తుందన్నారు. కార్మికుల కొరత, అధికారుల పర్యవేక్షణ లోపంతో పలు వార్డుల్లోని చెత్త సకాలంలో తరలించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రోజు విడిచి రోజు ఆవాస ప్రాంతాల్లో సేకరణ క్రమంగా జరగడం లేదు. వార్డులలో చెత్త పేరుకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. రాత్రిళ్లు కంటిమీద కునుకులేకుండా పోతుంది. ఇప్పటికైనా చెత్తాచెదారాన్ని తీసుకెళ్లడంతో పాటు సైడ్ కాల్వలను శుభ్రపరిచి, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరారు.

## మద్యంలో ఎలుకల మందు కలిపి అరుణ అనే మహిళ మృతి

బుద్వేల్, ఆగస్టు 21 (నమస్తే ఉదయం): మద్యంలో ఎలుకల మందు కలుపుకుని సేమించిన ఓ మహిళ మరణించింది. ఈ సంఘటన బుధవారం రాత్రి జరిగింది. వివరాలు ఈ విదంగా ఉన్నాయి... కిస్మత్పూర్ కు చెందిన శేఖర్ , ఆరుణ లు భార్యభర్తలు. అరుణ పువ్వులు అమ్ముతుం ది. వచ్చే డబ్బుతో ప్రతి రోజు ఆమె మద్యం సేవిస్తుంది. భర్త, కుటుంబ సభ్యులు ఆరుణ ను మద్యం సేవించవద్దని ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోలేదు. బుధవారం మద్యం సేవించిన అరుణ మద్యంలో ఎరుకల మందు కలుపుకుని త్రాగింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆరుణ ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్తికి తరలించగా ఆమె చికిత్స పొందుతు మరణించింది.



**కిస్మత్పూర్ లో బెల్టు షాప్ లను మూసి వేయాలి : స్థానికులు**

కిస్మత్పూర్ పరిసర బస్తీలలో బెల్టు షాపులు ఎక్కువగా ఉన్నాయని, వాటినన్నింటిని మూసి వేయాలని స్థానికులు కోరారు. బెల్టు షాపుల మీద అనేక రోజులుగా ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రాణాలు పోతున్న పట్టదా అని ప్రశ్నిచారు. బెల్టు షాపుల కారణంగా విద్యార్థులు కూడా త్రాగుడుకు బానిసలు అవుతున్నారన్నారు.

**కిస్మత్పూర్ లో బెల్టు షాప్ లను మూసి వేయాలి : స్థానికులు**

కిస్మత్పూర్ పరిసర బస్తీలలో బెల్టు షాపులు ఎక్కువగా ఉన్నాయని, వాటినన్నింటిని మూసి వేయాలని స్థానికులు కోరారు. బెల్టు షాపుల మీద అనేక రోజులుగా ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రాణాలు పోతున్న పట్టదా అని ప్రశ్నిచారు. బెల్టు షాపుల కారణంగా విద్యార్థులు కూడా త్రాగుడుకు బానిసలు అవుతున్నారన్నారు.

## బవానీ కాలనీ శ్రీ వైష్ణవి కళాశాల ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్

బుద్వేల్, అగస్టు 21 (నమస్తే ఉదయం) : బవానీ కాలనీ శ్రీ వైష్ణవి కళాశాల ప్రిన్సిపాల్ ముద్దం శ్రీనివాస్ గౌడ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం 84వ స్నాతకోత్సవంలో వృక్ష శాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. ఈ నెల 19న జరిగిన స్నాతకోత్సవంలో శ్రీనివాస్ గౌడ్ కు ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ చేతుల మీదుగా ఈ డాక్టరేట్ అందచేశారు. కళాశాల అధ్యాపకులు. విద్యార్థులు ప్రిన్సిపాల్ ముద్దం శ్రీనివాస్ గౌడ్ ను అభినందనలతో ముంచెత్తారు.



ఇస్రో చైర్మన్ డాక్టర్ వి నారాయణన్ చేతుల మీదుగా పీహెచ్ డీ పట్టా అందుకుంటున్న ముద్దం శ్రీనివాస్ గౌడ్

# బుద్వేల్ బస్తీ దవఖాన పరిసరాలలో అపరిశుభ్రమైన వాతావరణం

బుద్వేల్, ఆగస్టు 21 (నమస్తే ఉదయం): ప్రజలు నివసిస్తున్న బస్తీల వద్దకే వైద్యాన్ని అందిం చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్తీ దవఖాన ల కు సుస్తీ పట్టినట్లుంది. ఎంతో మంచి ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన బస్తీ దవఖాన ల పరిసరాలు అపరిశుభ్రంగా తయారైనా సం బందిత అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం. బుద్వేల్ జలమండలి కార్యాలయం పక్కన గల బస్తీ దవఖాన పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. గడ్డి మొలచి, చెత్త చెదారాలతో నిండి పోవడంతో దోమలు ఎక్కువగా ఉన్నాయి. రాత్రి వేళలలో మందు బాబులు మద్యం త్రాగి ఖాళీ సీసాలను బస్తీ దవఖాన పరిసరాలలో పారవేస్తుండటంతో ఇబ్బందిగా తయారైంది. చెత్త కుప్పలు, వర్షానికి నిలిచిన నీళ్లు బస్తీ



బుద్వేల్ బస్తీ దవాఖాన ముందు అపరిశుభ్రమైన వాతావరణం

దవఖాన చుట్టురా ఉండటంతో దుర్వాసన వస్తుంది.

**బస్తీ దవఖాన చుట్టు పరిసరాలను శుభ్రం చేయాలి: బండ్లగూడ నరేందర్, బుద్వేల్**

బుద్వేల్ లో గల రాజేంద్రనగర్ డివిజన్ జలమండలి కార్యాలయం పక్కన గల బస్తీ దవఖాన మ 0దు చెత్త చెదారం, మందు బాటిళ్లు, నీరు నిలచిన ప్రాంతాలతో దోమలు వృద్ధి చెంది దవఖాన కు వచ్చే రోగులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు బస్తీ దవఖాన పరిసరాలను శుభ్రం చేయాలి. నీరు నిల్వ ఉండకుండ చర్యలు తీసుకోవాలి. దోమల నివారణకు ఎంటమాలజీ విభాగం సిబ్బంది దోమల స్ప్రే చేయిం చాలి. రాత్రి వెళలలో పోలీస్ పెట్రోలింగ్ చేసే వాళ్లు బస్తీ దవఖాన వద్ద కూర్చుని మద్యం సేమి చే



ఆసుపత్రి ముందు నిలచిన నీరు

వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలి.

# స్టార్ హాస్పిటల్స్-సీనియర్ సిటిజెన్స్ కోసం స్టార్ సమ్మాన్ ప్రారంభం






హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే ఉదయం)ఆగస్టు 21న జరుపుకునే ప్రపంచ సీనియర్ సిటిజెన్స్ డే సందర్భంగా, స్టార్ హాస్పిటల్స్ స్టార్ సమ్మాన్ – సీనియర్ సిటిజెన్స్ హెల్త్ ప్రివిలేజెస్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రకటించింది. ఈ కార్యక్రమం ద్వారా వృద్ధులకు గౌరవప్రదమైన, ఆప్యాయమైన, తక్కువ ఖర్చుతో కూడిన వైద్య సేవలు అందించడంతో పాటు, ముందస్తు జాగ్రత్తలు, ప్రారంభ దశలో వ్యాధులను గుర్తించే అవకాశాలను కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా స్టార్ హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డా. రమేశ్ గూడపాటి మాట్లాడుతూ...

"మన సంస్కృతిలో మనం బుధవారం ఉన్న స్థాయికి రావడానికి పెద్దలే కారణం. వారిని గౌరవించడం కేవలం సంప్రదాయం మాత్రమే కాదు, అది మన కర్తవ్యమూ. స్టార్ సమ్మాన్ ద్వారా వృద్ధుల్లో ఆరోగ్య సమస్యలు రాకుండా చూసుకోవడం, అవసరమైతే సమయానికి సరైన చికిత్స అందించడం, అలాగే ప్రత్యేక రాయితీల ద్వారా వారి ఆర్థిక భారం తగ్గించడం మా ఉద్దేశ్యం. వృద్ధుల సంక్షేమం కోసం ఈ కార్యక్రమాన్ని ఎంతో శ్రద్ధతో రూపొందించామన్నారు.స్టార్ హాస్పిటల్స్ గ్రూప్ సీఈఓ డా. రాహుల్ మెడక్కర్ మాట్లాడుతూ...

"స్టార్ హాస్పిటల్స్ ప్రత్యేకత – కుటుంబ విలువల ఆధారంగా పనిచేయడం. మా సీనియర్ సిటిజెన్స్ అనేవారు రోగులు మాత్రమే కాదు, వారు తల్లిదండ్రులు, మార్గదర్శకులు, ప్రేరణల మూలం. స్టార్ సమ్మాన్ ద్వారా ప్రత్యేక హెల్ప్‌డెస్క్, హెల్ప్‌లైన్, రాయితీలు మాత్రమే కాకుండా, వృద్ధులను సలహాదారులుగా మా కమిటీలో భాగస్వాములను చేస్తాం. ఇంటి దగ్గరే చికిత్స కోరుకునేవారికి తక్కువ ఖర్చుతో హోమ్ కేర్ సదుపాయాలు కూడా అందిస్తాం. మా లక్ష్యం – వృద్ధులు గౌరవం పొందేలా, ఆప్యాయతతో చూసుకునేలా, ఆసుపత్రి సేవల్లో భాగస్వాములు కావాలన్న భావన కలిగేలా చూడడం." అన్నారు.

### స్టార్ హాస్పిటల్స్ గురించి:

హైదరాబాద్‌లో అగ్రగామి మల్టీ-స్పెషాలిటీ ఆసుపత్రిగా నిలిచిన స్టార్ హాస్పిటల్స్, అత్యాధునిక వైద్య సాంకేతికత, నైపుణ్యం, రోగి-కేంద్రిత సేవలతో ప్రసిద్ధి చెందింది. నగరంలోని పలు ప్రాంతాల్లో విస్తరించిన స్టార్ హాస్పిటల్స్, ఆరోగ్యాన్ని మరింత దయతో, సమగ్రంగా, అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉంది.

# బాల బాలికల సంరక్షణ సామాజిక బాధ్యత

### మానవ అక్రమ రవాణా పైన అవగాహన అవసరం

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




ప్రజ్వల ఎన్జీవో ఆధ్వర్యంలో బాల బాలికల రక్షణ, అక్రమ రవాణా అనే సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

జనగామ, ఆగస్టు 21 (నమస్తే ఉదయం): బాలల రక్షణ అనేది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని,వారి భవిష్యత్తును సురక్షితంగా, సంతోషంగా మార్చడానికి అందరూ కృషి చేయాలనీ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.గురువారం బాల బాలికల రక్షణ,మానవ అక్రమ రవాణా అనే అంశాల పైన ప్రజ్వల ఎన్జీవో ఆధ్వర్యంలో ఏకశిలా, బి ఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో జిల్లా రిసోర్స్ పర్సన్స్ కి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రతి చిన్నారి రక్షణ ప్రథమ కర్తవ్యంగా అందరూ పరిగనించాలన్నారు. చిన్నారుల ప్రాథమిక అవసరాలు తీరుస్తూనే శారీరక, మానసిక లేదా లైంగిక వేధింపులకు గురికాకుండా చూసుకోవడం కూడా అత్యంత ప్రాధన్యమన్నారు. పిల్లలకు విద్య, వైద్యం,. ఆహారం ఆశ్రయం పొందే హక్కు ఉందని,హింస హింస, దోపిడీ, అక్రమ రవాణా కు గురి కాకుండా చూసుకోవలిసిన బాధ్యత ఉందన్నారు. బాలల రక్షణకు అధికారుల కృషి తో పాటు,సమాజం నుండి కూడా సహకారం తప్పనిసరిగా ఉ ఒడాలన్నారు.వివిధ కార్యక్రమాల ద్వారా బాల బాలికల సంరక్షణ కోసం ఉన్న చట్టాలు, విధానాలను, రక్షణ సేవలను, హక్కుల గురించి అవగాహన కల్పించాలన్నారు.బాలల రక్షణ విద్యార్థి దశలో క్లిష్టమైనదని బాల బాలికలు 12 సంవత్సరాల పాటు పాఠశాలల్లో గడుపుతారని... అందుకని పాఠశాల యాజమాన్యం, పిల్లల తల్లిదండ్రులు వారి సంరక్షణ కోసం ప్రధాన భూమికను నిర్వహించాలన్నారు.బాలబాలికలు సామాజిక భద్రతా ప్రయోజనాలను అనుభవించాలని, ఆరోగ్యంగా పెరగడానికి, అభివృద్ధి చెందడానికి మన వంతుగా బాధ్యత వహించాలన్నారు.అన్ని రకాల నిర్లక్ష్యం, క్రూరత్వం, దోపిడీల నుంచి బాలలకు రక్షణ కల్పించాలని, ఏరకమైన అక్రమ రవాణాకు వారు గురికాకుండ చూసుకోవలిసినవసరం ఉ ఒదన్నారు.ఈ అవగాహన సదస్సు లో అభ్యసించిన అంశాలను, కాంప్లెక్స్ సమావేశాలు, తల్లిదండ్రులతో జరిగే సమావేశాలలో చర్చించి వారికి కూడా అవగాహన కల్పించాలన్నారు. మానవ అక్రమ రవణ ఏ విధంగా జరుగుతుంది,ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి,అసాంఘిక కార్యకలాపాలను పాల్పడే వారి బారిన పడకుండా ఎలా జాగ్రత్తగా ఉండాలి, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే ఏం చేయాలో తదితర మానవ అక్రమ రవాణా నిరోధ అంశాల పైన ప్రతీ పాఠశాల, కళాశాలలో అలాగే వివిధ సామజిక కార్యక్రమాలలో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం లో కోర్స్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, జి సి డి ఓ గౌసియా బేగం, సెంటర్ ఇంచార్జ్ మల్లిఖార్జున్,ప్రజ్వల ఎన్జీవో ప్రతినిదులు అంబర్ సింగ్, కృష్ణవేణి, రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు

# మృతి చెందిన విద్యుత్ ఆర్టిజన్ల కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలి

### టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ను కలిసి విజ్ఞప్తి చేసిన ఐ ఈ సి ఈ యు

### రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా వినతి





హైదరాబాద్, ఆగస్టు 21(నమస్తే ఉదయం) విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన ఆర్టిజన్ల కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ను కలిసి ఐ ఈ సి ఈ యు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ , మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా విజ్ఞప్తి చేశారు. బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగానే ఫీడర్లపై పనులు చేసే ఆర్టిజన్లు విద్యుత్ షాక్తో ప్రాణాలు కోల్పోతున్నారని, ఆయా బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి చట్ట ప్రకారంగా అందాల్సిన రూ.కోటి పరిహారం ఇప్పించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ టీజీఎస్ పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ ని కలిసి మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల విన్నవించారు. విద్యుత్ షాక్ కు ఇటీవల ముసారాంబాగ్ లో అంజద్ , ఇదే విదంగ మహిదీపట్నం లో అబ్దుల్, శంషాబాద్ లో అనిల్ అనే ఆర్టిజన్ కార్మికుడు ఫీడర్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్కు గురై అక్కడికక్కడే మృతిచెందిన విషయాన్ని ఎమ్మెల్యే వివరిస్తూ అతనిపై ఆధారపడిన కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత విద్యుత్ శాఖపై ఉందన్నారు. ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన ఆర్టిజన్ల కుటుంబాలను ఆదుకోవడానికి రూ.కోటి పరిహారం ఇచ్చేందుకు అవకాశమున్నా చట్టంలోని కొన్ని లోపాల కారణంగా కేవలం రూ.25లక్షల నుంచి రూ.30 లక్షల వరకు పరిహారం వచ్చే అవకాశముందన్నారు. ఇందులోని లోపాలను సవరించి రూ.కోటి పరిహారంతో పాటు బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలని ఆయన విన్నవించారు.శంషాబాద్ లో అనిల్ ఆర్టిసన్ కార్మికుడు విద్యుత్ షాక్ కు గురై మరణించడం జరిగిందని మృతుడి కుటుంబానికి కోటి రూపాయలు బీమా అందజేయాలని కోరారు. సిఎండి ముషారఫ్ ను కలిసిన వారిలో ఐ ఈ సి యు రాష్ట్ర అధ్య క్షుడు షాకీర్ అలీఖాన్ , కార్యదర్శి నందీశ్వర్, ఉపాధ్యక్షుడు సయ్యద్ కరీముద్దీన్ , హైదరాబాద్ దక్షిణ ప్రాంతీయ అధ్యక్షుడు సయ్యద్ సిరాజ్ , హెచ్ 82 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సాయిలు. ఇతెహాద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ కరిముద్దీన్, మహమ్మద్ హుస్సేన్,జాయింట్ సెక్రటరీ ఖాజా రహమత్ అలీ,ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ అహ్మద్, కోశాధికారి హబీబ్ ఔర్ రహమాన్ లు ఉన్నారు.



# ఆరో వార్డులో డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

### మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి

కొత్తకోట, ఆగస్టు 21(నమస్తే ఉదయం) కొత్తకోట మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డులో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని సిడిసి మాజీ చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ ను కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా ఆరో వార్డులో నెలకొన్న సమస్యలను చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి లు వివరించారు. ఈ సమస్యను ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో సమస్యను తెలుసుకోవటానికి పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ... మార్నింగ్ వాక్ లో తమ దృష్టికి వచ్చిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకుంటారు అన్నారు.



### గద్వాల నియోజకవర్గంలోని

# రోడ్లను పునర్నిర్మించండి

### రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రివర్యులతో సమావేశమయి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే బండ్ల

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21(నమస్తే ఉదయం) హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సమావేశమై గద్వాల నియోజకవర్గంలో 200 కిలోమీటర్ల రోడ్ల పునరనిర్మాణానికి ప్రతిపాదనతో కూడిన వినతిపత్రం అందజేశారు, తక్షణమే రోడ్లను పునరుద్ధరించాలని భారీ వర్షాల కారణంగా రోడ్లు పాడైన కారణంగా తక్షణమే పునర్నిర్మించాలని కోరారు అదేవిదంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల గురించి వినతి పత్రం అందజేసారు గద్వాల అభివృద్ధికి సహకరించాలని మంత్రి ని ఎమ్మెల్యే కోరారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సానుకులంగా స్పందించి త్వరలోనే జిల్లాలోని రోడ్ల మంజూరి ఇచ్చి పుణనిర్మానిస్తామని, అదేవిదంగా మిగతా సమస్యలను పూర్తి చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని కలిసిన వారిలో రమేష్ , మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ మాజీ జెడ్పిటిసి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



జనగామ సబ్ జైలు లో ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవ సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి సి విక్రమ్

# సబ్ జైలును సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి

జనగాం, ఆగస్టు 21(నమస్తే ఉదయం) జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్ పర్సన్, ప్రధాన న్యాయమూర్తి బి ప్రతిమ ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ సి విక్రమ్ గురువారం జనగాం లోని సబ్ జైలును సందర్శించారు. జైల్లో ఉన్న నేరము మోపబడిన ఖైదీలను పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులు లేని ఖైదీలు ఎవరన్నా ఉన్నారా అలాంటి వాళ్ళు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ దృష్టికి లిఖితపూర్వకంగా తెలియజేయలన్నారు. మీకు ఉచిత న్యాయవాదిని ఇస్తామన్నారు. ఒక్క రూపాయి కూడా ఫీజు రూపంలో న్యాయవాదులకు ఇవ్వవలసిన అవసరం లేదన్నారు. ఖైదీల కోసం జైల్లో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్ ను కూడా ఏర్పాటు చేశామన్నారు.. మీకు అందుబాటులో ఉన్న చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం రవీంద్ర అడ్వకేట్, మీకు దరఖాస్తులు రాసుకోవటానికి సహాయకారికా పారా లీగల్ వాలంటరీ బి శేఖర్ లు ఉన్నారన్నారు. అలాగే భోజన వసతులు ఎలా ఉన్నాయి .విచారణలో ఉన్న ఖైదీలతో జైల్ సిబ్బంది ప్రవర్తన గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీల కోసం ఏర్పాటుచేసిన కంప్లైంట్ బాక్స్ లో మీరు మీ సమస్యలను రాసి అందులో వెయ్యండి. ఆ బాక్స్ ను జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ మాత్రమే తెరుస్తారని ఖైదీలకు ఈ సందర్భంగా తెలిపారు.